
89వ వార్డు కార్పొరేటర్ ఇంటి వద్ద ఫ్లెక్సీ బోర్డులు


గోపాలపట్నం మెయిన్ రోడ్డులో దుకాణాలపై టీడీపీ ఫ్లెక్సీలు


ఆర్కే పురం ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ అనుబంధ సంస్థ ఫ్లెక్సీ

అధికార పార్టీ నేతలకు కోడ్ వర్తించదా?

- పలు చోట్ల తొలగించని ఫ్లెక్సీలు
- వెల్లువెత్తుతున్న విమర్శలు


శ్రీహరిపురం జంక్షన్‌లో టీడీపీ నాయకుడి ఫ్లెక్సీ

గోపాలపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది ఏమీ పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారులు, ఇతర చోట్ల ఉన్న టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు తీయడం లేదు. పలు చోట్ల ఉన్న నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసిన అధికారులకు టీడీపీ నేతల ఫ్లెక్సీలు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల్లో శిలాఫలకాలు కూడా కనిపించకుండా పేపర్లు అంటించారు. వర్షానికి చినిగిపోయాయే తప్పా కోడ్ ముగిసిన తర్వాత తియ్యలేదు. విగ్రహాలకు నిలువెత్తు గుడ్డ ముసుగులు వేసేశారు. కానీ ఇప్పుడు అవేమీ పట్టించుకోకుండా అధికార పక్షం ఒత్తిడితోనే అధికారుల నిర్లక్ష్యం వల్ల తొలగించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి కోడ్ అమలు చేసేలా స్థానిక అధికారులను ఆదేశించాలని పలువురు కోరుతున్నారు.


వెంకటాపురంలో టీడీపీ నేతల ఫ్లెక్సీలు

- గోపాలపట్నం పరిసర ప్రాంతంలో కోడ్ ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జీవీఎంసీ 89,91,92 వార్డుల్లో పలు చోట్ల టీడీపీ ఫ్లెక్సీలు తొలగించకుండా విదలేశారు. ఎమ్మెల్యే గణబాబు అనుమతి లేకుండా ఇంటి వద్ద డిజిటల్ లైటింగ్ బోర్డు ఉంది. దీనిపై ముసుగు వేయాల్సి ఉన్నా కానీ ఆ పని చేయలేదు.
- గోపాలపట్నం ప్రధాన రహదారిలో దుకాణాలపై బోర్డులు ఉన్నాయి. చాలా వాటిపై జెండాలు ఉన్నాయి.
- 92వ వార్డులో వెంకటాపురం వెళ్లేరోడ్డులో టీడీపీ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి.
- 98వ వార్డు కార్పొరేటర్ ఇంటి వద్ద ఫ్లెక్సీలు ఉన్నా ఎవరూ పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. అధికారులు ఒక పార్టీపైనే ఆంక్షలు అమలు చేస్తారా... అధికార పార్టీకి ఈ ఆంక్షలు వర్తించవా అంటూ నిలదీస్తున్నారు.

సేవా మార్గాల్లో టీడీపీ ఫ్లెక్సీలు

మల్కాపురం: జీవీఎంసీ 40,58,59, 60, 61, 63 వార్డుల్లో యథేచ్ఛగా టీడీపీ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా నగరంలో ఏ పార్టీకి చెందిన ఫ్లెక్సీ ఉంచరాదని జిల్లా కలెక్టర్ ఆదేశించినా.. క్షేత్ర స్థాయిలో పెద్దగా అమలు కావడం లేదు. కోడ్ అమల్లో ఉన్నా ప్రధాన మార్గాల్లో దర్జాగా టీడీపీ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఆశ్చర్యకరం. అయినా ఆయా ప్రాంత సచివాలయాల టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్లుప్తంగా

కళావేదిక ప్రారంభం


కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో బాపూజీ గ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కళావేదికను ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభ్యుదయ సంఘం ద్వారా భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా, నాయకులు జెర్రిపోతుల నర్సింగరావు, పుక్కల కృష్ణ, తోట రత్నం, బోండా కృష్ణ, శ్యామ్, గ్రామ పెద్దలు ఎం.జగ్గు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం


వరలక్ష్మికి నియామక పత్రం అందిస్తున్న కృష్ణ

మల్కాపురం: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా మహిళా పోర్టు రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా 58వ వార్డు పరిధి పిలకవాని పాలెం ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు చుక్క వరలక్ష్మిని నియమిస్తున్నట్టు హెచ్ఆర్‌సీఐ జాతీయ కన్వీనర్ బి.ఎస్.కృష్ణ (ఆల్ఫా కృష్ణ) తెలిపారు. ఈ మేరకు ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు.

చల్లగ చూడమ్మా.. కుంచుమాంబ


పూజలందుకున్న కుంచుమాంబ

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్ గ్రామదేవత కుంచుమాంబ అమ్మవారి పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల వాసులు పాల్గొన్నారు. పలువురు మహిళలు అమ్మవారికి పిండి వంటలను సమర్పించారు.

కేంద్రం ఏకపక్ష వైఖరి విడనాడాలి


దీక్ష శిబిరంలో కార్మిక సంఘాల నేతలు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్రప్రభుత్వం ఏకపక్ష వైఖరి అవలంబిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, విళ్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు అన్నారు. కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలని కుట్రలు చేస్తున్నారని, ఇది దుర్మార్గమని అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1271వ రోజు, సోమవారం వారు పాల్గొని మాట్లాడారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కోసం విలువైన భూమిని ధారాదత్తం చేసిన వారిని నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డొక్కా నరసింగరావు, కె.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ పోషకాలు


ఏకేసీ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

సింథియా: చంటి పిల్లలకు తల్లిపాలలో సంపూర్ణ పోషకాలు లభిస్తాయని మల్కాపురం సెక్టార్ సూపర్ వైజర్ వరలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు పరిధి క్రాంతినగర్, జీపీ కాలనీ, ఏకేసీకాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాజాత బృందం బాల్య వివాహాల వల్ల అనర్థాలను.. గుడ్ టచ్–బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ వరలక్ష్మి మాట్లాడుతూ పుట్టిన బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు చాలా ముఖ్యమైనవన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రు పాలు తాగించాలని, బిడ్డకు బిడ్డకు ఎడం పాటించాలని సూచించారు .అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందిస్తే పోషకాహార లోపాన్ని అధిగమించవచ్చునని తెలిపారు. అలాగే బాల్య వివాహ చట్టం, బాల కార్మికుల చట్టం, సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తాక్షాయిని, బి.లక్ష్మి, సీహెచ్.వరలక్ష్మి, బి.పద్మకుమారి, సచివాలయ సెక్రటరీ ఎంఎస్‌కే రాజ్యలక్ష్మి, ఏఎన్ఎం సత్యవతి, ఆశవర్కర్ జి.సుందరిమణి, మహిళా మండలి సభ్యులు మంగ, సావిత్రి, మదీనమ్మ, డ్వాక్రా సభ్యులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

9 శాతం వడ్డీకే సొసైటీ రుణాలు ఇవ్వాలి


మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న యూనియన్ సభ్యులు

- కార్మికుల డిమాండ్
- మోకాళ్లపై కూర్చుని నిరసన

గోపాలపట్నం: ఎన్ఏడీ సివిల్ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులకు 9 శాతానికే రుణాలివ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద సోమవారం మోకాళ్లపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సొసైటీ పాలకవర్గం సభ్యులకు సకాలంలో లోన్లు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. 9శాతానికే రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి, ఇపుడు రుణాలు మంజూరు చేయడం లేదన్నారు. మోసపూరిత హామీలతో సొసైటీని పతనం దిశగా తీసుకువెళ్తున్నారన్నారు. సలహా కమిటీ ముసుగులో తీవ్ర జాప్యం చేస్తున్నారని విమర్శించారు. సొసైటీకి వెన్నెముకలా ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ హోల్డర్లు కూడా భయాందోళనలకు గురవుతున్నారని, వారికి భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

- కొండవాలులో రక్షణ చర్యలు చేపట్టాలి
- అధికారులకు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశం


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

కంచరపాలెం: కొండవాలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగు పరచాలని, కొండవాలు మెట్ల మార్గాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ, రాంజీ ఎస్టేట్, సంజీవయ్య కాలనీ కొండవాలు ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. కాలువలో పూడికలు, ఫ్లోటింగ్ మెటీరియల్ అధికంగా వస్తున్నందున వాటిని ఎప్పటికప్పుడు అదుపు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల్లోని మెట్ల మార్గాల్లో రెయిలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నివాసాల్లోకి వర్షపు నీరు చేరుతున్నందున.. శాశ్వత పరిష్కారం కోసం రక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆయన ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో డయేరియా, అతిసార వ్యాధి, డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, దోమల వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్‌కు సూచించారు. వయసు పైబడిన పారిశుధ్య కార్మికులను కొండవాలు ప్రాంతాల నుంచి వేరొక చోటుకు మార్చివేసి సమర్థులైన కార్మికులను ఏర్పాటు చేయాలని జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–5 ఈఈలు, మత్స్యరాజు, తారా ప్రసన్నరెడ్డి, రెవెన్యూ అధికారి(ఆర్‌వో) బాబూరావు, ఏసీపీ వెంకటరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

'సాక్షి' చొరవతో కుటుంబం చెంతకు యువకుడు


సీఐ సమక్షంలో సతీష్‌ను కుటుంబ సభ్యులు అప్పగిస్తున్న మమత

గోపాలపట్నం: ఏడాది కిందట తప్పిన యువకుడు దొరకడంతో ఆ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తప్పిపోయిన బిడ్డ చెంతకు చేరడంతో సమాచారం ఇచ్చిన 'సాక్షి'కి అతడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు.. మూడు నెలల కిందట మతిస్థిమితం లేక ఫుట్‌పాత్‌పై జీవిస్తున్న యువకుడికి బుచ్చిరాజుపాలెంలోని నైట్ షెల్టర్‌లో ఆశ్రయం ఇచ్చారు. షెల్టర్‌లో యువకుడి వివరాలు సేకరించారు. తన పేరు సతీష్ అని కాకినాడకు చెందని వాడిగా గుర్తించారు. ఆ వివరాలు కాకినాడ 'సాక్షి' ప్రతినిధులకు వాట్సాప్ ద్వారా సమాచార మందించారు. దీంతో రంగంలోకి దిగిన 'సాక్షి' ప్రతినిధులు సతీష్ కుటుంబ సభ్యులను కలిసి విశాఖలో ఉన్న విషయాన్ని చేరవేశారు. దీంతో నైట్ షెల్టర్‌కు వచ్చిన కుటుంబ సభ్యులకు ఆ యువకుడిని ఎయిర్‌పోర్టు సీఐ సమక్షంలో నైట్‌షెల్టర్ మేనేజర్ మమత అప్పగించారు. ఏడాది కిందట తప్పిపోయిన సతీష్ దొరకడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

డాక్టరేట్లు పొందిన అధ్యాపకులకు సత్కారం


డాక్టరేట్ పొందిన వారిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ సత్యనారాయణ

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన పలు విభాగాల అధిపతులు డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు కళాశాలలో వీరిని చైర్మన్ సత్యనారాయణ అభినందించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఏఎస్‌సీ తేజశ్విని ' మొబైల్ హ్యాక్ నెట్ వర్క్‌లో డైనమిక్ స్టార్ రేటింగ్ ప్రొటోకాల్ అంశంపై చేసిన పరిశోధనకు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. అలాగే ఫిజిక్స్ విభాగ అధ్యాపకుడు డాక్టర్ ఉదయ్ భాస్కర్ 'క్రిస్టల్, నానో మెటీరియల్స్ వాటి అనువందిత సాంకేతిక పరికరాలపై చేసిన పరిశోధనకు కోయంబత్తూర్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ జీవన్‌రావు 'నానో టెక్నాలజీ సెమీ కండక్టర్ ఆధారిత జంక్షన్ లెస్ ట్రాన్సిస్టర్ మిషన్‌పై చేసిన పరిశోధనలకు మిజోరామ్ ఎన్ఐటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనాత్మక దృష్టి ఉంటే ఎంత ఎత్తుకైనా ఎదగ వచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ వర్మ, డీన్ డాక్టర్ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ డీపీవో రంజన్, ఇతర ఉన్నతాధికారులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, పర్సనల్ బ్రాంచ్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయంలో గల పర్సనల్ బ్రాంచిలో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్, పర్సనల్ బ్రాంచ్ రిక్రియేషన్ క్లబ్ కన్వీనర్ రంజన్ మహంతి, క్లబ్ సెక్రటరీ ఎం.రమేష్ నేతృత్వంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. సమాజంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు అత్యవసరమైన రక్తదాన సేకరణలో భాగస్వాములవ్వడం సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 56 మంది ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ రక్తాన్ని సేకరించింది. కార్యక్రమంలో అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్స్ ఎ.వెంకటేశ్వరరావు, అప్పారావు, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల మహాధర్నాను విజయవంతం చేయాలి


పెదగంట్యాడ సీడబ్ల్యూసీ వద్ద ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

పెదగంట్యాడ: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దీనబంధు కోరారు. ఈ సమస్యపై ఈ నెల 6 నుంచి 8 వరకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పెదగంట్యాడ సీడబ్ల్యూసీ వద్ద అసోసియేషన్ ప్రతినిధి కణితి అప్పలరాజు ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నాకు మద్దతుగా విశాఖ నగరంలోని జీవీఎంసీ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద ఈ నెల 8న ధర్నా చేయనున్నామని తెలిపారు. మినిమం పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, డీఏకు అనుగుణంగా మెడికల్ సౌకర్యాలు కల్పించాల న్నారు. కార్యక్రమంలో పెంటారావు, శెట్టి అప్పారావు, బైరెడ్డి గురప్ప, దుర్గారావు, శెట్టి చిన్నా సన్యాసిరావు, నక్క అప్పారావు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి సాదర స్వాగతం


విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న వైవీ సుబ్బారెడ్డి

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డికి సాదర స్వాగతం లభించింది. పలు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం ఆయన విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన నగరంలోకి బయలుదేరి వెళ్లారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


గోపాలపట్నం హైస్కూల్‌లో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, వాసం కేర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగకరమైన కార్యక్రమం నిర్వహించిన గౌరీ సేవా సంఘం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధా శివాజీ, సదరం శ్రీధర్, పాలిమేర జగదీశ్వరి, పెంటకోట మోహన్ తదితరులుపాల్గొన్నారు.

'స్వప్రయోజనాల కోసమే కులాల వర్గీకరణ'


మాట్లాడుతున్న దళితసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాలకు చట్టం చేయడం ద్వారా ఒక ప్రత్యేక కులాన్ని లేదా కులాలను విభజించడం, ఉప వర్గీకరణ చేయడం, తిరిగి వర్గీకరించడం, రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారు. రిజర్వేషన్ల ఉప వర్గీకరణ అధికారం రాష్ట్రాలకు ఇవ్వడం వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. ఉప వర్గీకరణల పేరుతో అట్టడుగునున్న దళితులకు న్యాయం జరగదన్నారు. సమాజంలో బలహీన వర్గాలకు సహాయం చేయడానికి అని చెప్పి రాష్ట్రాలు రిజర్వేషన్లు ఇచ్చేటప్పుడు వారి స్వార్థ లాభాల కోసం మాత్రమే వినియోగిస్తారని ఆరోపించారు. వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా సుప్రీం కోర్టు ధర్మాసనాన్ని దళిత సేన ఆశ్రయిస్తుందని అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చా కామేశ్వరరావు, కన్వీనర్ గొల్లమాల మీనా, కార్యదర్శి పట్నాల రూన్సీ, సభ్యులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అప్రమత్తత అవసరం


విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

మల్కాపురం: కంటి సమస్యలపై చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు ప్రకాష్ అన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే కంటి వైద్యుని వద్దకు వెళ్లాలని సూచించారు. పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన శిబిరంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. వేభారత్ ట్రస్ట్, మోసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్, మల్కాపురం కళాంజియ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు అదేపనిగా సెల్ ఫోన్లు, టీవీలు చూడరాదన్నారు. సుమారు వంద మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.